

రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే అంబేద్కర్‌కు ఇచ్చే నివాళి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

లౌకిక రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే అంబేద్కర్‌కు ఇచ్చే నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. బుధవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన అంబేద్కర్ వర్థంతి సభ నిర్వహించారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పార్టీ సీనియర్ నాయకులు బి.సోమయ్య పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం రవి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకొచ్చాక అంబేద్కర్ రాసిన రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని విమర్శించారు. బిజెపి నేతలు నేడు ఏం మాట్లాడినా ఒకే దేశం ఒకే మతం, ఒకే భాష అంటూ మత సామరస్యానికి నష్టం కలిగిస్తున్నారు. ప్రజలు తినే ఆహారంపై కూడా ఆంక్షలు పెడుతున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రామకృష్ణ, నాయకులు బి.జగన్నాధరావు, వి.సాయిబాబు, కోటేశ్వరరావు, మీసాల సత్యనారాయణ, త్రినాథ్, సింహాచలం పాల్గొన్నారు

68 వేల ఎకరాల్లో పంటనష్టం

347 గ్రామాల్లో 41 వేల ఎకరాల్లో దెబ్బతిన్న వరిపంట

వరి, మొక్కజొన్న, మినుము, పెసర, వేరుశెనగ, పొగాకు, పత్తి పంటలన్నీ ధ్వంసం

తడిసిన ధాన్యం కొనుగోలుపై మాటలకే పరిమితం

17 శాతం తర్వాత ఒక్కో శాతం తేమకు క్వింటాకు కిలో ధాన్యం తగ్గింపు

వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యపు రాశులు

దిక్కుతోచని స్థితిలో కౌలురైతులు


దెందులూరు మండలంలో నీటిపాలైన ధాన్యం

అన్నదాత.. ఆర్తనాదాలు..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

అన్నదాత ఆర్తనాదాలు మిన్నంటుతున్నాయి. తడిసిన ధాన్యం, నేలకొరిగిన పంట పొలాలను చూసి రైతులు గుండెలు బాదుకుంటున్నారు. కొట్టుకుపోయిన ధాన్యపురాశులు చూసి గుండెలవిసేలా కన్నీరుమున్నీరవుతున్నారు. జిల్లాలో దాదాపు 68 వేల ఎకరాల్లో పంటకు ముప్పు వాటిల్లింది. ధాన్యం కొనుగోలులో ఆలస్యం కారణంగానే పెద్దఎత్తున ధాన్యం తడిసి ముద్దయినట్లు చెబుతూ రైతులు విలపిస్తున్నారు. గడిచిన 24 గంటల్లో సరాసరిన 181.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

మిచౌంగ్ తుపాను ప్రభావంతో గడిచిన 24 గంటల్లో జిల్లాలో సరాసరిన 181.5 మిల్లీమీటర్ల వర్షం కురవడంతో జిల్లా రైతాంగం తీవ్ర నష్టాన్ని చవిచూసింది. వరి, మొక్కజొన్న, మినుము, పెసర, వేరుశెనగ, పొగాకు, పత్తి పంటలన్నీ తీవ్రంగా దెబ్బతిన్నాయి. చేతికొచ్చిన వచ్చిన పంట కళ్లముందే వరద పాలవ్వడంతో రైతుల ఆర్తనాదాలు మిన్నంటుతున్నాయి. ధాన్యపు రాశులు తడిసి ముద్దవ్వడమే కాకుండా పలుచోట్ల ధాన్యం కొట్టుకుపోయిన పరిస్థితి ఉంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. నేలకొరిగిన నీటిలో నానుతున్న పంట చేతికొస్తుందో, లేదో తెలియని అయోమయ పరిస్థితి ఏర్పడింది. జిల్లావ్యాప్తంగా 1,93,398 ఎకరాల్లో రైతులు వరిసాగు చేయగా ఇప్పటి వరకూ 89,542 ఎకరాల్లో మాసూళ్లు పూర్తయ్యాయి. ఇంకా 1,03826 ఎకరాల్లో పంట కోతలు కోయాల్సి ఉంది. దాదాపు 3.11 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి పంట మాసూళ్లు పూర్తి కావాల్సి ఉండగా తుపాను రైతులను తీవ్రంగా దెబ్బతీసింది. అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం జిల్లావ్యాప్తంగా 68,055 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. దీనిలో 41,473 ఎకరాలు వరిపంట, మిగిలిన పంటలు మొక్కజొన్న, మినుము, పెసర, వేరుశెనగ, పొగాకు, పత్తి వంటివి ఉన్నాయి. వరి పంటలకు సంబంధించి 27 మండలాల పరిధిలోని 347 గ్రామాల్లో 14,400 ఎకరాల్లో పంట ముంపునకు గురవ్వగా 27,033 ఎకరాల్లో పంట నేలనంటింది. దీంతో రైతులకు ఏంచేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. 650 ఎకరాల్లో మిరప, బొప్పాయి, అరటి, కూరగాయలు, పామాయిల్ వంటి ఉద్యాన పంటలు తుపానుకు దెబ్బతిన్న పరిస్థితి ఉంది.

తడిసిన ధాన్యంపై ధర కోత

జిల్లావ్యాప్తంగా మాసూళ్లు చేసి కళ్లాల్లోనే ఉన్న ధాన్యం దాదాపు 12 వేల మెట్రిక్ టన్నులు ఉంటుందని అధికారుల లెక్కలు చెబుతున్నాయి. పలుచోట్ల రాశులు పూర్తిగా మునిగిపోయిన పరిస్థితి ఉండగా, పలుచోట్ల అడుగుభాగం తడిసిన పరిస్థితి ఉంది. తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తామంటూ ప్రభుత్వం చెబుతున్న మాటలు ఎక్కడా అమలుకాని పరిస్థితి ఉంది. రైతులకు ఎటువంటి నష్టమూ లేకుండా ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉండగా, 17 శాతం తర్వాత తేమశాతం ఒక్కింటికి క్వింటాల్‌కు కిలో ధాన్యం కోత కోసే విధంగా అధికారులకు ఆదేశాలు ఇచ్చిన పరిస్థితి ఉంది. తడిసిన ధాన్యం రోడ్లపై ఆరబెట్టేందుకు టోటకట [illegible] రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు చేసే పరిస్థితి లేకుండాపోయింది. తేమశాతం పేరుతో ఇబ్బందులు సృష్టించడం కారణంగానే తమ ధాన్యం వర్షానికి తడిసిపోయినట్లు రైతులు [illegible]. [illegible] పోతునూరు వంటి గ్రామాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. దాదాపు 90 వేల ఎకరాల్లో మాసూళ్లు పూర్తవ్వగా కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యం కేవలం లక్షా ఐదువేల టన్నులే. చాలావరకూ ధాన్యం అయినకాడికి నష్టానికి దళారులకే అమ్ముకున్న పరిస్థితి ఉంది.

దిక్కుతోచని స్థితిలో కౌలురైతులు

జిల్లావ్యాప్తంగా వివిధపంటలు సాగుచేసిన వారిలో 70 శాతానికిపైగా కౌలురైతులే ఉన్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.40 వేల వరకూ పెట్టుబడులు పెట్టారు. తుపానుకు పంటను కోల్పోవడంతో కౌలురైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కౌలురైతుల పేర్లు వెబ్‌ల్యాండ్‌లో లేకపోవడంతో పంట నష్టపరిహారం సైతం [illegible] పరిస్థితి నెలకొంది. కౌలురైతులను ఆదుకోకపోతే పరిస్థితి అత్యంత దారుణంగా మారనుంది.

తుపానుకు దెబ్బతిన్న పంటల వివరాలు

పంట	మండలాలు	పంటముంపు	నేలకొరిగినపంట	మొత్తం
వరి	27	14,440	27,033	41,473
మొక్కజొన్న	18	4,632	3,854	8,486
మినుము	14	4,035	66	4,101
పెసర	2	5,886	0	5,886
వేరుశెనగ	12	691	239	930
పొగాకు	14	2,650	1,702	4,352
పత్తి	10	1,734	1,093	2,827
మొత్తం		34,068	33,987	68,055

దెబ్బతిన్న ఉద్యానవన పంటలు: 650 ఎకరాలు

నీరు తగ్గిన తర్వాత నష్టపరిహారం అంచనాలు

బి. లావణ్యవేణి, జాయింట్ కలెక్టర్

ప్రస్తుతం కళ్లాల్లోని ధాన్యానికి సంబంధించి పైభాగం తడవని ధాన్యాన్ని తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం పొలాల్లో నీరు ఉంది. తడిసిన ధాన్యం ఆరబెట్టే విధంగా రైతులకు సూచనలు చేస్తున్నాం. నీరు తగ్గిన తర్వాత పంటనష్టంపై అంచనాలు వేయడం జరుగుతోంది.

తొమ్మిదెకరాల ధాన్యం కొట్టుకుపోయింది



చిలుకూరి శ్రీనివాసరావు, కౌలురైతు, కైకరం

ఖరీఫ్‌లో తొమ్మిదెకరాలు సాగు చేశాను. మాసూళ్లు పూర్తిచేసి కైకరం రైల్వేగేటు దగ్గర్లో ధాన్యం రాశులుగా చేశాం. తుపానుకు ఎర్రకాలువ గండ్లు పడి వరద రావడంతో తొమ్మిదెకరాల ధాన్యం కొట్టుకుపోయింది. ఏంచేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. అధికారులొచ్చి చూసి వెళ్లారు. ప్రభుత్వం ఆదుకోకపోతే కుటుంబం మొత్తం రోడ్డున పడతాం. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాను.

ఆ రోజు కొనుగోలు చేసుంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు



నున్న నాగదుర్గారావు, పోతునూరు, కౌలురైతు

తొమ్మిదెకరాల్లో కౌలుకు వరిసాగు చేశా. మాసూళ్లు చేసిన ధాన్యం ఆరబెట్టి గడిచిన ఆదివారం రైతుభరోసా కేంద్రానికి తీసుకెళ్లాను. 17 శాతం తేమ ఉందని, మరో రోజు ఆరబెట్టాలంటూ చెప్పారు. సోమవారం నుంచి వర్షం కురవడంతో పంటంతా తడిసి ముద్దయింది. ఆ రోజు కొనుగోలు చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. తొమ్మిదెకరాల్లో పండిన ధాన్యం అంతా తడిసిపోయింది. రోడ్డుపైనే చేరేదెలా. కొనుగోలు చేస్తారో, లేదో తెలియడం లేదు. అదనంగా ఇప్పుడు రూ.30 వేలకు పైగా ఖర్చవుతోంది. ప్రభుత్వం ఆదుకోకపోతే కుటుంబం మొత్తం రోడ్డున పడతాం.

ధాన్యం తడిసి.. అదనపు ఖర్చు పెరిగే



బైరెడ్డి లక్ష్మణరావు, సుంకరవారితోట

ఐదెకరాల్లో వరి మాసూళ్లు చేశాను. ఇళ్ల స్థలాల ప్లాటుల్లో ఆరబెట్టి రాశులు చేసిన ధాన్యం తడిసి ముద్దయిపోయింది. 200 సారలు తడిసిపోయాయి. ధాన్యం రంగుమారితే ఎంతకు కొనుగోలు చేస్తారో తేలీదు. ఇప్పుడు అదనంగా రూ.20 వేలకుపైగా ఖర్చవుతోంది.

రైతులకు అండగా నిలవండి

పొలాల్లో నీరు తొలగింపునకు ప్రాధాన్యతివ్వాలి

ప్రత్యేక వైద్య, పారిశుద్ధ్య కార్యక్రమాలపై దృష్టి పెట్టండి

టెలి కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

పంటపొలాల్లో నిలిచి ఉన్న వర్షపునీటిని పూర్తిగా తొలగించడంపై దృష్టి పెట్టాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. బుధవారం తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అమలు చేయాల్సిన సహాయ, పునరుద్ధరణ కార్యక్రమాలపై ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, వ్యవసాయ, తదితర శాఖల అధికారులతో ఆయన టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం ప్రతి రైతుకూ అండగా నిలుస్తుందన్న విషయాన్ని వారికి తెలియజెప్పి భరోసా కల్పించాలన్నారు. పంటల రక్షణ, పంటలకు పరిహారం అందించడం, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయడం దగ్గర నుంచి అన్ని రకాలుగా రైతుకు ప్రతి అడుగులోను ప్రభుత్వం అండగా ఉంటుందనే విషయాన్ని తెలియజేసి ధైర్యం కల్పించాలన్నారు. తుపాను, వర్షాల మూలంగా సుమారు 33,724 ఎకరాల్లో పంట ఒరగ్గా, మరో 24,575 ఎకరాల్లో పంట ముంపునకు గురైందన్నారు. దానిలో వరి 7,458 ఎకరాలు ఉందని వివరించారు. జిల్లాలో ఖరీఫ్ ధాన్యం ఇంతవరకు 1,05,948 మెట్రిక్ టన్నులు సేకరించామన్నారు. ఆఫ్‌లైన్లో 28,324 మెట్రిక్ టన్నులు సేకరించినట్లు తెలిపారు. రహదారుల పక్కన ఒబ్బిడి చేసిన ధాన్యాన్ని ఆరబెట్టి రైస్‌మిల్లులకు పంపేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కైకలూరు ప్రాంతంలో 11 డ్రయ్యర్ మిల్లులు ఉన్నాయని, వాటి దగ్గరకు పంపేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఏలూరు డివిజన్‌లో ఎక్కువ నష్టం జరిగినందున సంబంధిత ధాన్యం తరలింపులో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఏలూరు ఆర్‌డిఒను కలెక్టర్ ఆదేశించారు. రెండు రోజుల్లో బృందాలు ఏర్పాటు చేసి పంటనష్టం అంచనా వేయాలన్నారు. 80 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడగా యుద్ధప్రాతిపదికపై 79 గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారన్నారు. దెబ్బతిన్న 127 విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి వేశారన్నారు. 12 గుడిసెలు దెబ్బతిన్నాయన్నారు. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టేందుకు 547 శానిటేషన్ బృందాలు, 1440 క్లాప్ మిత్రాలు, 40 ట్రాక్టర్లు, 30 జెసిబిలు, 30 జనరేటర్లను వినియోగించినట్లు తెలిపారు. 78 వైద్య శిబిరాల ద్వారా 6,389 మందికి వైద్యం అందించారన్నారు. ప్రాథమిక అంచనాల మేరకు జిల్లాలో 470 కిలోమీటర్లు ఆర్‌అండ్‌బి రహదారులు దెబ్బతిన్నాయన్నారు. తాగునీటి వనరులను శుభ్రం చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

జిల్లాల్లో వివిధ రిజర్వాయర్ల ప్రస్తుత పరిస్థితి

తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్ట్ ఎఫ్‌ఆర్‌ఎల్ 108.20 మీటర్లు కాగా ప్రస్తుతం 102.16 మీటర్లు ఉంది. ఎర్రకాలువ రిజర్వాయర్ ప్రాజెక్టు ఎఫ్‌ఆర్‌ఎల్ 83.05 మీటర్లు కాగా ప్రస్తుతం 82.68 మీటర్లు ఉంది. కొవ్వాడ కాలువ రిజర్వాయర్ ప్రాజెక్టు ఎఫ్‌ఆర్‌ఎల్ 90.50 మీటర్లుండగా ప్రస్తుతం 85.05 మీటర్లు ఉంది. జల్లేరు రిజర్వాయర్ ప్రాజెక్టు ఎఫ్‌ఆర్‌ఎల్ 217.80 కాగా ప్రస్తుతం 215.70 మీటర్లు ఉందని జలవనరుల శాఖ ఎస్‌ఈ వై.శ్రీనివాసరావు తెలిపారు.

9, 10 తేదీల్లో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు

ప్రజాశక్తి - ఏలూరు

యుటిఎఫ్ రాష్ట్ర 49వ కౌన్సిల్ సమావేశాలు ఈనెల 9, 10 తేదీల్లో ఏలూరు మినీబైపాస్ రోడ్డులోని చలసాని గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో కౌన్సిల్ సమావేశాల పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగే ఈ సమావేశాల్లో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, పాత పెన్షన్ విధానం సాధనకు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. భవిష్యత్తులో 'అదనంగా గంట విద్యార్థుల కోసం' ఉపాధ్యాయులు కేటాయించాలనే నినాదాన్ని కూడా తీసుకోబోతున్నామని తెలిపారు. ఈ సమావేశాల్లో ఎక్కువ మంది ఉపాధ్యాయులు హాజరు కావాలని కోరారు. సమావేశాల తొలిరోజు ఉదయం స్థానిక కెనాల్ రోడ్డులోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయం నుంచి చలసాని గార్డెన్ వరకూ ర్యాలీ నిర్వహిస్తున్నామని చెప్పారు. అనంతరం బహిరంగ సభ ఉంటుందని, ఈ సభలో పిడిఎఫ్ ఎంఎల్‌సిలు కెఎస్.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, షేక్ సాబ్జీతోపాటు యుటిఎఫ్ రాష్ట్ర పూర్వపు ప్రధానకార్యదర్శి పి.బాబురెడ్డి, ఏలూరు కార్పొరేషన్ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, విద్యా శ్రేయోభిలాషి ఎస్ఎంఆర్ పెదబాబు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకత్వం హాజరవుతుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు హాజరై సమావేశాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్‌పి.మనోహర్‌కుమార్, బి.సుభాషిణి, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ఏలూరు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ ముస్తఫాఅలీ, రవికుమార్ రుద్రాక్షి, కోశాధికారి జివి.రంగమోహన్, కార్యదర్శి ఎస్.సుధారాణి, కె.కమల్‌కుమార్, ఆడిట్ కన్వీనర్ బి.మోహనరావు, ఆడిట్ సభ్యులు తేరా ప్రసాద్ పాల్గొన్నారు.

కల్లాల్లో అన్నదాతల కన్నీళ్లు

మద్దతు ధరకే తడిచిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

రైతులకు నష్టపరిహారం ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి

ఎ పి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - దెందులూరు

ఆరుదలకు వచ్చిన ధాన్యం సైతం కొనుగోలు చేయకుండా ఆలస్యం చేయడం వల్ల రైతులు నష్టపోయారని, మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు ధాన్యపు రాశులు సైతం నీట మునిగి అన్నదాతలు కళ్లాల్లో కన్నీళ్లు పెట్టుకుంటున్నారని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని పోతునూరులో బ్రాంచి కాలువ ఆయకట్టు పరిధిలో పంట పొలాల్లో నీట మునిగిన ధాన్యపు రాశులను సంఘం నాయకులు పరిశీలించారు. రైతులు, కౌలు రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుని ధాన్యం కొనుగోలు చేసి ఉంటే నష్టపోయే వారం కాదని రైతులు ఆవేదన చెందారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తడిచిన, రంగు మారిన ధాన్యాన్ని మద్దతు ధరకే కొనుగోలు చేసి అన్నదాతలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తడిచిన ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జారీ చేయాలని కోరారు. రైతులకు గోనె సంచులిచ్చి, అందుకు తగిన రవాణా వాహనాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని కోరారు. రైతులకు తగిన టార్పాలిన్లు కూడా అందించలేకపోయిందని విమర్శించారు. నష్టపోయిన రైతులకు, కౌలు రైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షులు గండి రాజా, కార్యదర్శి సున్నా వెంకట్రావు, నేతలు నున్న శేషగిరి, ఆగుళ్ల రాజు, నున్న దుర్గారావు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: తుపాన్ కారణంగా దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మికసంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో మిచౌంగ్ తుపాన్ కారణంగా దెబ్బతిన్న వరి, పత్తి, మినుము, మామిడి పంటలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ, ఉద్యానవన శాఖల ద్వారా పంటనష్టం అంచనాలను సత్వరం తయారుచేసి నష్టపోయిన రైతులకు పెట్టుబడులకు అనుగుణంగా పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం ఏలూరు జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ, చాకిరి శివనాగారాజు, గంటా పాపారావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోటేశ్వరరావు, శౌరి, అంజయ్య పాల్గొన్నారు.

నిడమర్రు : వర్షానికి తడిసిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయాలని సిపిఎం, ఎపి రైతుసంఘం నేతలు డిమాండ్ చేశారు. అడవికొలను, భువనపల్లి, ఎనికేపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను నాయకులు పరిశీలించారు. రైతులను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పంటలను పరిశీలించిన వారిలో నాయకులు వెలగలేటి మోహన్, కానూరు రాజు, సరిపల్లి సర్వేసురావు, గంజి గణేష్, కె.అన్నవరం ఉన్నారు.

జిల్లాలో 181.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

ఏలూరు: జిల్లాలో గత 24 గంటల్లో 181.5 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా జంగారెడ్డిగూడెం మండలంలో 301.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవ్వగా ముదినేపల్లిలో 92.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జీలుగుమిల్లి మండలంలో 285, కలిదిండి 164.8, కైకలూరు 164.4, పెదపాడు 114.4, ఏలూరు 122.6, కొయ్యలగూడెం 146.8, భీమడోలు 240.2, పెదవేగి 140.6, దెందులూరు 145.8, ఆగిరిపల్లి 150.4, ఉంగుటూరు 244.2, నూజివీడు 116.8, నిడమర్రు 217.4, జీలుగుమిల్లి 285, ముసునూరు 110.2, చాట్రాయి 140.2, లింగపాలెం 125.6, టి.నరసాపురం 240.2, కామవరపుకోట 250.8, బుట్టాయగూడెం 158.4, ద్వారకాతిరుమల 256, పోలవరం 197, చింతలపూడి 235.4, కుక్కునూరు 205.4, వేలేరుపాడు మండలంలో 218 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

ప్రతిరైతునూ ప్రభుత్వం ఆదుకుంటుంది : జెసి

దెందులూరు: మిచౌంగ్ తుపాను వల్ల నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని జాయింట్ కలెక్టర్ బి. లావణ్యవేణి స్పష్టం చేశారు. బుధవారం మండలంలోపి గుండుగొలనులోని సువర్ణ రైస్ మిల్లును జెసి సందర్శించారు. అనంతరం రహదారి ప్రక్కన భద్రపరచిన ధాన్యం రాశులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలస్థాయి, దెబ్బతీన్న తీరుపై ఎన్యూమరేషన్ చేసి పూర్తి నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు. పొలాల నుంచి నీళ్ల బయటకు వెళ్లే మార్గాలను చేయడంలో రైతులకు ఉపాధిహామీ వేతనదారులు సహకరిస్తున్నారన్నారు. జిల్లాలో ఖరీఫ్ ధాన్యానికి సంబంధించి ఇంతవరకు 1,05,948 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. ఆఫ్ లైన్‌లో 28 వేల 324 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. మిల్లు నిర్వహణతీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత యజమాని అందుబాటులో లేకపోవడంతో మిల్లుకు సంబంధించిన వివరాలతో గురువారం కలెక్టరేట్‌కు రావాలని ఆదేశించారు. రహదారి పక్కన భద్రపరచిన ధాన్యపు రాశుల్లో పైభాగం పొడిగా ఉన్నందున ఆధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని అధికారులకు ఆదేశించారు. అదే విధంగా ఏమైనా తడిచిన, తేమ ఎక్కువ ఉన్న ధాన్యన్ని కైకలూరు పరిధిలో ఉన్న డ్రయ్యర్ రైస్ మిల్లులకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వీరివెంట పౌర సరఫరాల జిల్లా మేనేజరు మంజు భార్గవి, దెందులూరు తహశీల్దారు నాంచారయ్య ఉన్నారు.

ఓటు హక్కు నమోదుకు 3 రోజులే గడువు

ఏలూరు: ఓటర్లుగా చేరేందుకు మరో మూడు రోజులు మాత్రమే గడువు ఉందని, ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ బుధవారం తెలిపారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని కోరారు. ప్రస్తుత ఓటర్ల జాబితా సవరణలో, ఓటు హక్కు కోసం ఈ నెల తొమ్మిదో తేదీ వరకూ దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించిందని ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా 18 సంవత్సరాల నిండిన యువత ఓటరుగా నమోదు కావాలని ఆయన కోరారు. 2024 జనవరి ఐదో తేదీన తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని అందులో ఓటరుగా నమోదు కావాలంటే ఈ నెల తొమ్మిదో తేదీలోగా ఓటరుగా నమోదు కావాలని స్పష్టం చేశారు.

పొగాకు, మొక్కజొన్నకు అపార నష్టం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

తుపాను ప్రభావిత వర్షాలకు వర్జీనియా పొగాకు తోటలకు అపార నష్టం సంభవించింది. మంగళవారం తెల్లవారుజామున ప్రారంభమైన ఎడతెరిపి లేని వర్షం అర్ధరాత్రి వరకూ కొనసాగింది. దీనికి ఈదురుగాలులు తోడయ్యాయి. కొయ్యలగూడెం వర్జీనియా పొగాకు వేలం కేంద్రం పరిధిలో ఐదు వేల హెక్టార్లలో పొగాకు తోటలు వేసినట్లు వేలం నిర్వహణాధికారి గ్రేస్ మార్గరెట్ తెలిపారు. భారీ వర్షాలకు 80 శాతానికి పైగా తోటలు ముంపు బారిన పడ్డాయన్నారు.

మొక్కజొన్న నాశనం

అప్పుడే విత్తిన మొక్కజొన్న భారీ వర్షాలకు తీవ్రంగా దెబ్బతింది. మండలంలోని పలు గ్రామాల్లో అప్పుడే విత్తిన మొక్కజొన్న ముంపు కారణంగా కుళ్లిపోయాయని రైతులు వాపోతున్నారు. మొక్కజొన్నతోపాటు ప్రత్యామ్నాయ వ్యవసాయ ఆధారిత పంటలు కూడా తుపాను తాకిడికి దెబ్బతిన్నాయి.

గ్రామాల్లో గాడంధకారం

మండలంలో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. మంగళవార సాయంత్రం ఆరు గంటల నుంచి తుపాను విజృంభించి బలమైన ఈదుగాలులు వీయడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొన్నిచోట్ల స్తంభాలు విరిగిపడిపోవడంతో గ్రామాలకు బుధవారం ఉదయం వరకూ విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాలేదు.

అన్నదాత కుదేలు..!


ప్రజాశక్తి - చింతలపూడి

మిచౌంగ్ తుపాను దెబ్బకు వరి, మొక్కజొన్న, పత్తి, వేరుశనగ, పొగాకు, మిరప పంటలు దెబ్బతిన్నాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారు. కోతలు పూర్తయ్యి ఆరబట్టిన ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. కోతకొచ్చిన వరి నేలకొరిగింది. మండలంలో 15 వేల ఎకరాల్లో వరి సాగుచేశారు. ఇందులో వర్షాభావంతో తొమ్మిది వేల ఎకరాల్లో పంట పాడైంది. ప్రస్తుత తుపాను దెబ్బకు ఆరు వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. పత్తిరైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. క్రాసింగ్ అయిన పత్తి చేతికి వచ్చే సమయంలో పంట నేలకొరగడంతో రైతులకు నష్టం తప్పలేదు.

తుపానుకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందిస్తుందని, అధైర్యపడొద్దని తహశీల్దార్ కృష్ణజ్యోతి, మండల వ్యవసాయాధికారి మీనాకుమారి తెలిపారు. వర్షానికి దెబ్బతిన్న పంటలను వారు బుధవారం పరిశీలించారు. రైతులను వివరాలు అడిగితెలుసుకున్నారు. నష్టానికి సంబంధించి నివేదికను తయారుచేసి కలెక్టర్‌కు అందిస్తామని చెప్పారు.

మండవల్లి: మిచౌంగ్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షానికి మండవల్లిలో అంతర్గత రహదారులు చెరువులను తలపించాయి. నాలుగు రోజులుగా ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు జనజీవనం స్తంభించింది. డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీటితో మురుగునీరు కలిసి రోడ్లపైకి చేరింది. మంచాలకాలనీ, బిసి హాస్టల్ రోడ్డు, కైకలూరు సందు, వెలమపేటలోని రహదారులన్నీ పూర్తిగా మురుగునీటితో మునిగిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

కలిదిండి : తుపాను కారణంగా మండలంలోని పడమటిపాలెంలో 45 కుటుంబాలు ముంపుబారిన పడ్డాయి. వీరి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వారికి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పునరావాసం కల్పించారు. సిపిఎం నాయకులు త్రిమూర్తులు, సత్యన్నారాయణ, సర్పంచి సానా మీన, సరస్వతి, రామారావు బాధితులను పరామర్శించారు.


ముంపులో తాడువాయి శివాలయం

జంగారెడ్డిగూడెం: మిచౌంగ్ తూపాన్ ప్రభావంతో విస్తారంగా కురిసిన వర్షాలకు ఎర్ర కాలవ జలాశయం సమీపంలో ఉన్న తాడువాయి శివాలయం నీట మునిగింది. శివాలయంలో నడుములోతు వరకూ నీరుచేరింది. తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు జల్లేరు వాగు నుండి ఎర్రకాలువ జలాశయంలోకి గంటకు 2500 నుండి మూడువేల క్యూసెక్కుల వరకు వరద నీరు చేరుకుంది.

కొయ్యలగూడెం : తుపాను ప్రభావంతో రాజవరంలో 22 ఏకరాలు, ఎర్రంపేటలో 12 ఏకరాలు, పొంగుటూరు పంచాయతీ పరిధిలో 18 ఏకరాల్లో వరి పంటలు దెబ్బతిన్నాయి. అలాగే గవరవరం, చొప్పరామన్నగూడెంలో పంటలు స్వల్పంగా దెబ్బతిన్నాయి.

మిచౌంగ్‌కు నలుగురు బలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మిచౌంగ్ తుపాను ఇద్దరిని బలిగొంది. షెడ్డు కూలి ఒకరు, ఈదురుగాలులకు చలి మంటలు ఎగసిపడి మరొకరు సజీవదహనమయ్యారు. మండలంలోని రాజానగరంలో మంగళవారం రాత్రి చోటుచేసుకున్న విషాద ఘటనలకు సంబంధించి బంధువులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గంగరాజు(60) గ్రామంలోని సెంటర్‌లో ఉన్న ఓ రేకుల షెడ్డులో కూర్చున్నాడు. ఈయనతోపాటు మరికొందరు అదే షెడ్డులో ఉన్నారు. తుపాను ప్రభావంతో బలమైన ఈదురుగాలులు వీచడంతో షెడ్డు కూలిపోయింది. ఈ ప్రమాదంలో షెడ్డుకు సంబంధించిన సిమెంట్ స్తంభం గంగరాజు తలపై పడింది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మిగిలినవారు తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. ఆ పక్కనే ఉన్న మరో షెడ్డులో కోళ్లకు కాపలాగా ఉన్న గ్రామానికి చెందిన జోడే రాముడు(58) చలి ఎక్కువగా ఉండటంతో చలిమంట వేసుకున్నాడు. బలమైన ఈదురుగాలులకు మంటలు ఎగసిపడి రాముడుకు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో అతను బయటకు వచ్చే మార్గంలేక షెడ్డులోపలే సజీవదహనమయ్యాడు. అలాగే పాకలో ఉన్న కోళ్లు మొత్తం కాలిపోయాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. బుట్టాయగూడెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీలుగుమిల్లి: మండలంలోని కామయ్యపాలెం సమీపంలో భారీ వర్షాల కారణంగా పొంగుతున్న వరద ప్రవాహంలో చిక్కుకుని యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బర్రింకలపాడు గ్రామానికి చెందిన చిర్రి ముత్యాలరావు (22) ద్విచక్ర వాహనంపై తన స్నేహితులతో కలిసి వాగోడ్డుగూడెం వెళ్లి తిరిగి వస్తుండగా కామయ్యపాలెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో ద్విచక్ర వాహనంతో పాటు కొట్టుకుపోయాడు. స్నేహితులు హుటాహుటిన వెళ్లి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. గ్రామస్తులు ఘటనా స్థలానికి చేరుకుని గాలించారు. సాయంత్రం సమయంలో మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ వి.చంద్రశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మండవల్లి: మిచౌంగ్ తుపాను ప్రభావంతో వీచిన చలిగాలులకు వృద్ధురాలు మృతి చెందిన సంఘటన కానుకొల్లు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన కె.పెద్దింట్లమ్మ(92) గ్రామంలో పూరిగుడిసెలో ఒంటరిగా ఉంటుంది. ఈ క్రమంలో చలికి మృత్యువాతపడింది.



అంబేద్కర్‌కు వినతిని అందిస్తున్న అంగన్‌వాడీలు

అంబేద్కర్ విగ్రహానికి అంగన్‌వాడీల వినతి

ప్రజాశక్తి - చింతలపూడి

అంగన్‌వాడీలకు తెలంగాణా కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చెయ్యాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి టి.మాణిక్యం తెలిపారు. చింతలపూడి పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయం ఎదురుగా ఉన్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి బుధవారం వినతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేయ్యాలని, వేతనంతో కూడిన మెడికల్, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. హెల్పర్లకు వయోపరిమితి 50 సంవత్సరాలు పెంచాలని తెలిపారు. ప్రమోషన్‌లో రాజకీయ జోక్యం అరికట్టాలన్నారు. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారానికి ఈనెల 8వ తేదీ నుంచి సమ్మె చేపడుతున్నామని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సరళ, కవిత, అరుణ పాల్గొన్నారు.

ముంపు బాధితులకు భోజనాలు

కామవరపుకోట: మండల కేంద్రంలోని కొండగూడెం రోడ్డులో మసీదు వద్ద వలస వచ్చి ఉంటున్న వరద ముంపు బాధితులకు శ్రీవీరభద్ర స్వామి అన్నదాన కమిటీ ఫ్రెండ్ సర్కిల్ వారి ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గుడారాలు కూలిపోయి వరద నీటితో నిండిన వలస జీవుల విషయాన్ని స్థానిక ఎంఆర్ఒ సత్యనారాయణకు సహయ ఫౌండేషన్ ట్రస్ట్ ఛైర్మన్ మీరవల్లి మధు తెలియజేయగా వారికి బియ్యం అందజేయడం జరిగింది. అలాగే వర్షం కారణంగా ఇబ్బంది తలెత్తినట్లయితే హైస్కూలులో పునరావాసం ఏర్పాటు చేస్తామని వరద బాధితులకు ఎంఆర్ఒ సూచించారు.

పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లు

ఉంగుటూరు: వెల్ఫేర్ ఆఫ్ చేబ్రోలు వాట్సప్ గ్రూపు ఆధ్వర్యంలో చేబ్రోలు పంచాయతీ పారిశుధ్య కార్మికులకు రెయిన్ కోట్లు బుధవారం అందజేశారు. సర్పంచి రాంథే లక్ష్మీ సునీత, గ్రూపు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి బివి.రవిచంద్రకుమార్, మాజీ సర్పంచి రాంథే రాజారావు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

జీలుగుమిల్లి : మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా గత మూడు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురవడంతో పలు రకాల పంటలు దెబ్బతిన్నాయి. అధికారులు బుధవారం మండల వ్యాప్తంగా క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించారు. ఐటిడిఎ పిఒ సూర్యతేజ, తహశీల్దార్ సుందర్ సింగ్, మండల వ్యవసాయ శాఖ అధికారులు గంగాధర్, ఉద్యానవన శాఖ అధికారి నవీనలు క్షేత్ర స్థాయిలో తిరిగి పంటలను పరిశీలించారు. ఇందులో వరి 235, వేరుశనగ 273, పొగాకు 375, పత్తి 145, మొక్కజొన్న 19 ఎకరాల మేర పంటలు నీట మునిగి దెబ్బతిన్నట్లు తెలిపారు.

చింతలపూడి : ధాన్యం తడిసిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు అధైర్యపడొద్దని నియోజకవర్గ ఎంఎల్ఎ ఉన్నమాట్ల ఎలిజా అన్నారు. ప్రగడవరంలో తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అధికారులతో మాట్లాడామని, తడిసిన ధాన్యం కూడా కొనుగోలు చేస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చెన్నకేశవరెడ్డి, అలవాలబాబు, మోహన్ రావు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : రైతులు అధైర్య పడొద్దని, తడిచిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి పంట నష్టాలపై అంచనాలు తయారుచేసి ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాలన్నారు. కలెక్టర్‌ని రైతులు నష్టపోకుండా ధాన్యం కొనుగోలుకు, నష్టపోయిన ఇతర పంటలపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

తుపాను ప్రభావంతో మండలంలో ఈదురుగాలులకు, అధిక వర్షానికి కుప్పకూలిన పత్తి పంట, వరి పంటలను మండల వ్యవసాయాధికారి బి.సుమలత పరిశీలించారు. మండలంలో వివిధ పంటలు వరి 179.5 ఎకరాలు, వేరుశనగ 37, మొక్కజొన్న 126, ప్రత్తి 85.3, పొగాకు 280 ఎకరాల్లో ప్రాథమిక నష్టం అంచనా వేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, విఎఎలు పాల్గొన్నారు.

చాట్రాయి: తుపాను కారణంగా గత మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షానికి పాడైపోయిన పంటలను, తమ్మినేని రిజర్వాయర్ ప్రాజెక్టుపై నిర్మించిన బ్రిడ్జిపై వరద ఉధృతిని నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, నియోజకవర్గం ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు పరిశీలించారు.

పోలవరం : తుఫాన్ ప్రభావంతో నీట మునిగిన వరి పొలంలో నీరు బయటకు వెళ్లేందుకు, ధాన్యం రాశుల చుట్టూ ఉన్న నీరు బయటకి తరలి వెళ్లేందుకు ఉపాధి హామీ వేతనదారులతో బుధవారం పనులు చేయించడం జరిగిందని ఎన్ఆర్ఇజిఎస్ ఎపిఒ వెంకటేశ్వరరావు తెలిపారు.

జంగారెడ్డిగూడెం: మండలంలో 860 ఎకరాలలో వరిచేలు నీట మునిగాయని ఎడి కెవిఎన్.పోసారావు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండలంలోని లక్కవరం గ్రామంలో తుపాన్ ప్రభావానికి గురై నీట మునిగిన వేరుశనగ పంటను ఎంపిపి కొదమ జ్యోతి అధికారులతో కలిసి పరిశీలించారు.

ముదినేపల్లి : నష్టపోయిన రైతులందరినీ ఆదుకునేందుకు ప్రభుత్వం చిత్త శుద్ధితో పనిచేస్తుందని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కోడూరు, చినపాలపర్రు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్డుపై కూలిన చెట్ల తొలగింపు

పోలవరం: తుపాను ప్రభావం తగ్గడంతో స్థానిక పోలవరం పంచాయతీ పరిధిలో బుధవారం అత్యవసర పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి వై.కొండలరావు తెలిపారు. గత రెండు రోజులుగా భారీ వర్షాల కారణంగా ఏటిగట్టు రహదారిపై రోడ్డుకి అడ్డంగా పడి ఉన్న చెట్టులు పంచాయతీ, పారిశుధ్య కార్మికులు చేస్తున్న తొలగింపు పనుల ఆయన దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమాలలో బంగారు కృష్ణ, పంచాయతీ పారిశుధ్య కార్మికులు ఉన్నారు.

కొయ్యలగూడెం: కన్నాపురం రోడ్డులో తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా రోడ్డుకు అడ్డంగా చెట్టు పడిపోయింది. తహశీల్దార్ నాగమణి సిబ్బంది, పోలీస్ సిబ్బంది, పంచాయతీ అధికారులు చెట్టును తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సమస్యను పరిష్కరించారు.

నేరాలు - ఘోరాలు

డ్రెయినేజీలో పడి వృద్ధుడు మృతి

నూజివీడు రూరల్ : మండలంలోని అన్నవరం గ్రామంలో బుధవారం పిల్లి కృష్ణమూర్తి(65) సైకిల్‌పై వెళుతూ డ్రెయినేజీలో పడి మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలకు డ్రెయినేజీ ఉధృతంగా ప్రవహించడంతో బయట పడలేక అందులోనే వృద్ధుడు చనిపోయినట్లు తెలిపారు.

వాహనం అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

జీలుగుమిల్లి : ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తికి గాయాలైన ఘటన మండలంలోని బర్రింకల పాడు సమీపంలో రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొక్కెర ఎల్లయ్య(55) అంతర్వేదిగూడెం వెళ్తుండగా బర్రింకలపాడు టర్నింగ్ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి తుప్పల్లో దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో అతనికి గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108లో పిహెచ్‌సికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

రైతు కష్టం 'నీటి'పాలు

భారీ వర్షానికి నిండా మునిగిన రైతన్న
వర్షపు నీటిలో వరి పనలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

రైతన్న తొలుత సాగునీటి కోసం ఇబ్బందులు పడినా.. అష్టకష్టాలు పడి సాగు నీటిని సమకూర్చుకోగా, పంట చేతికి వచ్చే తరుణంలో తుఫాన్ రైతుకు కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది. ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికొచ్చే సమయంలో కళ్లెదుటే నీటి పాలు అవుతుంటే అన్నదాతలు ఏమి చేయాలో తెలియక తీవ్ర ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది కూడా ఇదే నెలలో కోతల సమయంలో వర్షాలకు చేతికొచ్చిన పంట నీటిపాలైంది. ఈ ఏడాది కూడా చేతికి వస్తుందనుకున్న సమయంలో తుఫాన్ రూపంలో నీటి పాలు కావడంతో రైతుల ఆవేదన చెందుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటివరకు యంత్రాలతో కోసిన పంటను కల్లాల్లో, సురక్షిత ప్రాంతాలకు చేర్చి, పరదాలు కప్పి, రైతులు వర్షానికి తడవకుండా చర్యలు చేపట్టారు. సోమ, మంగళ వారాలు కురిసిన భారీ వర్షాలకు, ఈదురు గాలులకు మండల వ్యాప్తంగా వేలాది ఎకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న పైరు నేల వాలింది. పలు గ్రామాల్లో కోసి పనలపై ఉన్న పంట భారీ వర్షానికి నీట మునిగింది. బీదర ఈదురు గాలులకు చేలు చాపలా నేల వాలాయి. నేల వాలిన పైరుపై వర్షపు నీరు చేరడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

మండలంలోని కాకరవాడ కోల శ్రీనివాసరావు అనే రైతు చేలో మోకాలు లోతు నీరు చేరడంతో కోసిన వరి పనలు నీటిపై తేలాడుతున్నాయి. ఈ పరిస్థితి చూసిన రైతు ఏమి చెయ్యాలో తెలియక కంట నీరు పెట్టుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షానికి కోసి పనలపై ఉన్న పైరు నీటిలో తేలాడుతుంది. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా జోరుగా కురుస్తున్న వర్షానికి, గాలులకు మండల వ్యాప్తంగా రైతాంగం తీవ్రంగా పంట నష్టపోయింది. ఎకరాకు వేలాది రూపాయలు అప్పు చేసి, పెట్టుబడులు పెట్టి తీరా పంట చేతికి అందే సమయంలో తుపాను పంటను తుడుచు పెట్టుకుపోవడంతో రైతన్నలు గగ్గోలు పెడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఏమి చేయాలో తెలియక రైతన్నలు తికమక పడుతున్నారు. దీనికి తోడు భారీ వర్షాలకు మినుముల చల్లిన పొలాలు కూడా దెబ్బతిని పరిస్థితి ఉందని రైతులు చెబుతున్నారు. మినుములు వర్షానికి కుళ్లిపోతాయని, మళ్లీ మరోసారి మినుములు చల్లుకోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి,



తడిసిన వరిపైరుతో రైతు శ్రీనివాసరావు

నిబంధనలు సడలించి తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేసి అన్నదాతను అందుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.

మహోన్నత వ్యక్తి 'అంబేద్కర్'

అంబేద్కర్ 67వ వర్ధంతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 67వ వర్ధంతి పురస్కరించుకుని బుధవారం ఏలూరులో పాత బస్టాండ్ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా హాజరైన ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బడుగు, బలహీన వర్గాల, గిరిజనులు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం అనేక హక్కులు కల్పిస్తూ రాజ్యాంగాన్ని రచించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ అధ్యక్షులు ముస్తఫా ఆలీ, రవికుమార్, మోహన్ రావు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయంలో నియోజకవర్గం ఇన్‌ఛార్జి బడేటి రాధాకృష్ణ పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు, జాలా బాలాజీ, లంకపల్లి మాణిక్యాలరావు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల గరుడ బొమ్మ సెంటర్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి టిడిపి శ్రేణులు పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. గోపాలపురం నియోజకవర్గ టిడిపి మాజీ ఎంఎల్ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కూరాకుల బుజ్జి, రేవూరి వెంకటేశ్వరరావు, వాసిరెడ్డి ప్రవీణ్, తాడేపల్లి సుబ్బారావు పాల్గొన్నారు.

మండవల్లి: అణగారిన వర్గాలకు స్వేచ్ఛ, స్వాతంత్రాన్ని అందించే విధంగా రాజ్యాంగాన్ని రచించిన మహోన్నత వ్యక్తి భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని మాజీ ఎఎంసి ఛైర్మన్ గుమ్మడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. అంబేద్కర్ 67వ వర్ధంతి పురస్కరించుకుని స్థానిక సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి బుధవారం పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. మాల మహాసేన అధ్యక్షులు పళ్లెం ఏడుకొండలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మెండ జాన్సీ, రాష్ట్ర బిసి సెల్ నాయకులు లావేటి వీర శివాజీ, సుధామ ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ సుధా బత్తుల విజయకుమార్, అభ్యుదయ నవ సమాజ సొసైటీ అధ్యక్షులు పాగోలు అభిష, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు పాల్గొన్నారు.

చింతలపూడి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి చింతలపూడిలో ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి బోయగూడెం మాష్టారు అజేయ్ వెంపాకృష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. చింతలపూడి పట్టణంలో కొవ్వురుగూడెం యూత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన సేవలు ఎనలేనివని చింతలపూడి ఎంపిడిఒ మురళీకృష్ణ అన్నారు. చింతలపూడి పట్టణంలో ఎంపిడిఒ కార్యాలయం వద్ద డాక్టర్ బిఆర్.అంబేద్కర్



ఏలూరు అర్బన్ : మాట్లాడుతున్న ఎంఎల్‌సి సాబ్జి

వర్ధంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళుర్పించారు.

చాట్రాయి : మండలంలోని చిన్నంపేట గ్రామంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం అంబేద్కర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ హైస్కూల్ ప్రిన్సిపల్ పలగాని శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం, అంతరాలు లేని సమాజం కోసం పనిచేయటమే ఆయనకు నిజమైన నివాళి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తేలూరు ప్రసాదు, కొమ్ము నాగేశ్వరరావు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



ఏలూరు టౌన్ : మాట్లాడుతున్న రాజేంద్ర ప్రసాద్

ఏలూరు టౌన్ : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వజ్ఞాని, కరుణా సంపన్నుడు, నైతికత మార్గ నిర్దేశకుడని బాలల హక్కుల కమిషన్ రాష్ట్ర సభ్యులు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ చెప్పారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం ఏలూరు జెవియర్ నగర్‌లోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో వర్ధంతి సభ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి రాజేంద్ర ప్రసాద్, ఎఎస్‌డబ్ల్యూ బి.రమేష్, సాంఘిక వేత్త అజయ్ బాబులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఆధునిక కాలంలో మరుగు చేయబడిన బౌద్ధాన్ని పునరుద్ధరణ చేసిన ధీశాలి అని కొనియాడారు. అనంతరం సాంఘిక వేత్త మెతర అజయ్ బాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిబిఆర్ సిసిటి కో ఆర్డినేటర్ భలే సురేష్, హాస్టల్ వార్డెన్ జి.వెంకటేశ్వరమ్మ, విద్యావేత్త సురేష్ పాల్గొన్నారు.

హిందుత్వ కార్పొరేట్ శక్తుల నుంచి భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌కు నిజమైన నివాళులని బిసి సబ్‌ప్లాన్ ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్ల సాధన పోరాట వేదిక జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు, జిల్లా కన్వీనర్ గొల్ల వెంకటకృష్ణారావులు తెలిపారు. అంబేద్కర్ 67వ వర్ధంతి సందర్భంగా వారికి ఘనంగా నివాళులర్పించారు.

భీమడోలు: అంబేద్కర్ ఆశయాలు అందరికీ ఆదర్శప్రాయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. సర్పంచి పి.సునీత మాన్సింగ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి సత్కరించారు. రత్నా డిగ్రీ కళాశాలలో కరస్పాండెంట్ కె.ప్రేమ్ కుమార్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బాలు ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ సిహెచ్.పద్మావతి దేవి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

కలిదిండి : సానా రుద్రవరంలో అంబేద్కర్ విగ్రహానికి సిపిఎం ఆధ్వర్యంలో మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు, కార్యకర్తలు డిటి.మూర్తి చైతన్య, జక్కుల మహేష్, పరసా రాజేష్, చిన్నం శ్రీకాంత్, సురేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మట్టగుంటలో రాష్ట్ర టిడిపి బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు, మండల ఎస్‌సి సెల్ ఉపాధ్యక్షులు బళ్లారాజు, మాజీ సర్పంచి బొమ్మిడి మార్రాజు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముసునూరు : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం మండలంలోని లోపూడి గ్రామ సచివాలయంలో వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, సర్పంచి పేరం కృష్ణ ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు బి.నరసింహారావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం మున్సిపల్ ఛైర్‌పర్సన్ క్యాంప్ కార్యాలయం, జగ్జీవన్ నగర్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలతో ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లిలో అంబేద్కర్ వర్ధంతి వేడుకల్లో నిమ్మగడ్డ బిక్షాలు, సోమల వరప్రసాద్, పాగోలు విజయ్, గండేపూడి చిన్ని పాల్గొన్నారు.

టి.నరసాపురం : మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో బుధవారం అంబేద్కర్ యువత ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలపర్తి విజయ్, రామారావు, చిన్న వెంకటేశ పాల్గొన్నారు.

భీమడోలులో రికార్డు స్థాయిలో వర్షపాతం

భీమడోలు : మండలంలో బుధవారం రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. దశాబ్దాల చరిత్రలో ఒక్క రోజులో 241 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావటం విశేషమని అధికారులు అంటున్నారు. ఈక్రమంలో మంగళవారం సాయంత్రం నాలుగు గంటల సమయానికి 137 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, బుధవారం ఉదయానికి వర్షపాతం నమోదు 241 మిల్లీమీటర్లకు చేరింది. దీని ప్రభావం వల్ల గుండుగొలను వద్ద నిర్మిస్తున్న వంతెన పునర్నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతం ప్రమాదకారిగా మారింది. నిర్మాణ పనులు జరుగుతున్న ఎగువ భాగంలో ఉన్న మట్టి కిందకు చేరటం, కొంతమేర ఆ ప్రాంతపు కింద భాగంలోని మట్టి కుప్పకూలడం జరిగింది. దీని దృష్టిలో ఉంచుకొని ఆ ప్రదేశంలో సంచరించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానికులు కోరుతున్నారు. ఇదేవిధంగా తుఫాను కారణంగా మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. యుద్ధ ప్రాతిపదికన అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. వానల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లోని ఆరు నివాస గృహాలు ధ్వంసమయ్యాయి. మండలంలోని ఎంఎం.పురం, పొలసానిపల్లి, భీమడోలు ప్రాంతాల్లోని ముంపు ప్రాంతాల లోనికి వరద నీరు చేరింది. రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భీమడోలు పంచాయతీ కార్యదర్శి ఎస్.ఠాగూర్ భీమడోలు పంచాయతీ పరిధిలో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. భీమడోలు ప్రాంతంలోని జాతీయ రహదారి, అంబర్‌పేట పంచాయతీ, కురెళ్ల గూడెం గ్రామపంచాయతీ, సూరప్పగూడెం గ్రామపంచాయతీ పరిధిలలో వరద నీటిని తరలించేందుకు ఆయా గ్రామపంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్.పద్మావతి దేవి తెలిపారు. వరద బాధితులను ఆదుకునేందుకు పునరావాస కేంద్రాలు సిద్ధం చేసినప్పటికీ, వాటి అవసరాలు రానందువల్ల పెద్దగా ఇబ్బంది లేకపోయిందని తహశీల్దార్ ఎం.ఇందిరా గాంధీ తెలిపారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మిచౌంగ్ తుపాను కారణంగా పంట నష్టం కలిగిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు జెట్టి గురునాథరావు అన్నారు. బుధవారం మండలంలోని వేగవరం గ్రామంలో తుపాను కారణంగా మునిగిపోయిన పొగాకు తోటలను, ఇతర పంటలను పరిశీలించి నష్టపోయిన రైతులను పరామర్శించారు.

మెట్ట ప్రాంతంలో వాణిజ్య పంటలు బేరన్ పొగాకు, నాటు పొగాకు, మొక్కజొన్న, వేరుశనగ, మిర్చి, వరి, ఇతర పంటల రైతులు అపారంగ నష్టపోయారని తెలిపారు. సుమారుగా 25 వేల ఎకరాల పైబడి పొగాకు, నాటు పొగాకు పంటనష్టం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు అట్లూరి సతీష్, మలకాని నాగబాబు, వేగవరం సర్పంచి నాగరాజు పాల్గొన్నారు.

చింతలపూడి: తుఫాను వల్ల నష్టపోయిన వరి, మొక్కజొన్న, వేరుశనగ రైతులను ఆదుకోవాలని నాయిబ్రాహ్మణ జిల్లా సాధికారిత కన్వీనర్ కొప్పెర్ల నాగరాజు అన్నారు. మండలంలోని ప్రగఢవరం పంచాయతీ ముక్కంపాడు గ్రామంలో అకాల తుపాను కారణంతో నష్టపోయిన రైతులు మానేపల్లి రాజారావు, ఏసు, ఇతర రైతుల పొలాలను పరిశీలించారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి కొనకళ్ల వీర్రాజు, చక్రపు మారేశ్వరరావు, కెటిఆర్, రాచకొండ రాంబాబు, మానేపల్లి రాజారావు, తోమ్మంద్రు వెంకట్రావు, తుమ్మూరి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ముసునూరు: తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి, నష్టపోయిన రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని, నష్ట నివారణ చర్యలు అధికారులు వెంటనే చేపట్టాలని, పంట నష్టాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వడానికి ఒక కమిటీని వేయాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. వరి రైతులకు ధాన్యాన్ని ఆరపెట్టడానికి సబ్సిడీ ద్వారా పట్టాలను వెంటనే ఇప్పించాలని కాట్రిని పాడు, ముసునూరు గ్రామాల తరపున తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సర్పంచి గద్దల సుహాసిని మోహన్ రావు, ఎంపిటిసి సూర్యదేవర నాగ మంజుల శ్రీనివాసరావు, రాపర్ల ప్రతాప్, పాకనాటి సీతారాం, కొండేటి బాబీ, రైతులు పాల్గొన్నారు.

పోలవరం : మండలంలో మిచౌంగ్ తుఫాన్ కారణంగా గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరి, మొక్కజొన్న పంటలు నీట మునిగాయి. ప్రభుత్వం వెంటనే స్పందించి తిరిగి మళ్లీ పంట పండించడానికి ఎకరానికి రూ.20 వేల పంట నష్టాన్ని తక్షణమే అందజేయాలని టిడిపి మండల అధ్యక్షులు బొడ్డు కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో నునకాని రాంబాబు, సానా గోపాలం, రైతులు పాల్గొన్నారు.

గూటాల గ్రామంలో గత రెండు రోజులుగా తూపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షానికి మత్స్యకారుల పేటలో నీట మునిగిన ఇళ్లను టిడిపి మాజీ మండల అధ్యక్షులు పాపోలు గణపతి రత్తయ్య బుధవారం పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శికి, ఉన్నతాధికారులకు ఫోన్ చేసి మత్స్యకారుల పేటలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి తక్షణమే సహాయ చర్యలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగు యువత అధ్యక్షులు పెద్దేహపు వీర వెంకట సత్యనారాయణ, తాళ్లపూడి వెంకటేశ్వరరావు, కొంజర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: పల్లెర్లమూడి గ్రామంలో తుపాను ప్రభావంతో ఎడతెరిపి లేని వానలు కురవడం వల్ల వరిచేలు నీట మునిగాయని రైతు సంఘం నాయకులు, గ్రామ సచివాలయం, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు నష్టపోయిన పంటలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం అధ్యక్షులు నిమ్మగడ్డ నరసింహ మాట్లాడుతూ తుపాను ప్రభావంతో నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

కొయ్యలగూడెం: గత మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కమిటీ సభ్యురాలు గంగిరెడ్ల మేఘలాదేవి పేర్కొన్నారు. రైతుల పంట తుపాన్ కారణంగా నీట మునిగిందన్నారు. ప్రభుత్వం తక్షణమే సహాయక చర్యలు చేపట్టి వరద బాధిత రైతులను ఆదుకుని, వారికి నష్టపరిహారం చెల్లించాలని మేఘలాదేవి ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

మండవల్లి: తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులను తక్షణమే ఆదుకోవాలని, లేకుంటే టిడిపి ఆధ్వర్యంలో రైతుల పక్షాన నిలబడి ఆందోళన చేపడుతామని మాజీ ఎంపీ మాగంటి బాబు స్పష్టం చేశారు. పెరికే గూడెంలో నీట మునిగిన వరి పొలాలను ఆయన టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి బుధవారం పర్యటించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మారగాని వీర వెంకట నాగేశ్వరరావు, కైకలూరు మాజీ జెడ్‌పిటిసి సభ్యురాలు బొమ్మన బోయిన విజయలక్ష్మి పాల్గొన్నారు.

ముదినేపల్లి : తుపాను కారణంగా వరి పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వ ఆదుకోవాలని టిడిపి నియోజకవర్గ నాయకులు కొడాలి వినోద్ కోరారు. బుధవారం ఆయన మండలంలోని కోడూరు, ముదినేపల్లి గ్రామాల్లో పర్యటించారు. ముంపు బారిన పడి నీట మునిగిన వరి పొలాలను టిడిపి శ్రేణితో కలిసి పరిశీలించి, పంట నష్టపోయిన రైతులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బొంగు రవికుమార్ పాల్గొన్నారు.

9న జాతీయ లోక్ అదాలత్

ఏలూరు : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ తెలిపారు. బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనములో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలోను, జిల్లా కోర్టు పరిధిలోను ఈ జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, ఈ అదాలత్‌లో రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు పరిష్కరించబడతాయని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని తెలిపారు.

డిఎల్‌పిఒ కార్యాలయం తనిఖీ

నూజివీడు రూరల్: నూజివీడు పట్టణంలోని డిఎల్‌పిఒ కార్యాలయాన్ని బుధవారం తెల్లవారు జామున జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాధ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పరిశీలన అనంతరం ఆయన మాట్లాడుతూ మిచౌంగు తుపాను నేపథ్యంలో అధికారులకు జిల్లా కలెక్టరేట్ ఆదేశాలతో విధులు కేటాయించినట్లు తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా పరిశీలనకు వచ్చినట్లు తెలియజేశారు.

ఆపన్నులకు అండగా వైసిపి

ఏలూరు టౌన్ : 43వ డివిజన్ జనపురెడ్డి వారి వీధికి చెందిన నాగులపల్లి అశోక్ కుమార్(45) పెట్రోల్ బంక్‌లో పనిచేసేవారు. గత కొంత కాలం క్రితం ప్రమాదవశాత్తు కాలికి తీవ్ర గాయమై, అనంతరం పెరాలసిస్‌తో మంచానికే పరిమితమయ్యారు. ఆయన భార్య ఓ షాప్‌లో పనిచేయడం ద్వారా వస్తున్న కొద్దిపాటి డబ్బులతోనే ఆ కుటుంబం జీవనం వెళ్లదీస్తున్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గత కొంత కాలం క్రితం వారి ఇంటికి వెళ్లిన ఎంఎల్ఎ ఆళ్ల నానికి వారి దీనస్థితిని వివరించి పింఛన్ మంజూరు చేయాలని వినతిని అందించారు. ఈ మేరకు స్పందించిన నాని తక్షణమే పెన్షన్ మంజూరు చేయాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ మేరకు ఆయనకు ఈ నెలలో రూ.5 వేల (డిఎహెచ్ఒ) పెన్షన్ మంజూరు కాగా స్థానిక నేత జనపురెడ్డి కృష్ణ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్, అతని కుటుంబ సభ్యులు ఎంఎల్ఎకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్ గణేశ్వరి, వెల్ఫేర్ సెక్రెటరీ ప్రవీణ్ పాల్గొన్నారు.

తుపాను దాటికి ఇల్లు ధ్వంసం

కొయ్యలగూడెం: తుపాను దాటికి మండలంలో తీవ్ర నష్టం వాటిల్లింది. అచ్యుతాపురం గ్రామంలో ఏకంగా బిల్డింగులు ధ్వంసమయ్యాయి. కొన్నిచోట్ల పూరిగుడిసెలపై కప్పులు ఎగిరిపోయినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని విన్నవించుకున్నారు.

వృద్ధులకు భోజనాలు

జంగారెడ్డిగూడెం : సీతా మహాలక్ష్మి స్వచ్ఛంద సేవా సంస్థ వృద్ధులకు ఆశ్రయం కల్పించి మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, చిన్నా దంపతులు ఔదార్యం చాటుకున్నారని మున్సిపల్ వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు అన్నారు. బుధవారం తుపాను కారణంగా ఆశ్రమంలో వృద్ధులకు స్థానిక బుట్టాయగూడెం రోడ్‌లోని చంద్రశేఖర కళ్యాణ మండపంలో ఆశ్రయం కల్పించి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి అధ్యక్షులు చిటికెల అచ్యుతరామయ్య పాల్గొన్నారు.